# "ఏ అధికారమువలన?"

ఒకనాడు యేసు దేవాలయములో బోధించుచుండగా, ప్రధాన యాజకులును పెద్దలును ఆయన వద్దకు వచ్చి "ఏ అధికారమువలన నీవు ఈ కార్యములు చేయుచున్నావు? ఈ అధికారమెవడు నీ కిచ్చెను?" అని అడిగారు (మత్తయి 21:23). వారి ప్రశ్నకు ప్రభువు సమాధానం చెప్ప నిరాకరించాడు; అది మంచి ప్రశ్నే అయినా వారి దుష్ట ఆలోచన ఆయన ఎరుగును. అయితే ప్రభువు దానికి యితర సందర్భాలలో జవాబిచ్చాడు. ఆయన బోధ తండ్రి వద్దనుండి వచ్చినదని ఆయన ప్రకటించాడు.

నేడు, మతసంబంధమైన ప్రతి ఆచారమును గూర్చి అలాటి ప్రశ్న అడగడం మంచిదే. దానికి "క్రీస్తు అధికారంవలన" అనేది మన తండ్రిని ఆనందింపజేసే అవకాశంగల ఒకే ఒక జవాబుగా ఉంది. యేసుకు "సర్వాధికారం" యివ్వబడింది (మత్తయి 28:18). ఆయన సంఘమునకు శిరస్సైయున్నాడు (ఎఫెసీ. 1:22, 23). దేవుడు నేడు తన కుమారుని ద్వారా మనతో మాట్లాడుతున్నాడు (హెబ్రీ. 1:2). "ఈయన మాట వినుడి"! అని రూపాంతర సమయంలో దేవుడు పలికినప్పుడు ఈ వాస్తవం నొక్కి చెప్పబడింది (మత్తయి 17:5; మార్కు 9:7; లూకా 9:35).

క్రీస్తు సంఘముల మధ్యనున్న ఆచరణలను గూర్చి ఈ ప్రశ్న అడగడం నాకు ఎంతో సంతోషం. అలాగే, "ఏ అధికారము వలన నీవు ఈ కార్యము చేయుచున్నావు?" అని ఈ ప్రశ్నను గురించి యితరులను అడగడానికి నాకు హక్కుందని నేను నమ్ముతాను.

## "క్రైస్తవుడు" అనే పేరు ఉపయోగించుకొనే అధికారం

శిష్యులు "క్రైస్తవులనబడ్డారు" (అపో. 11:26). ఈ నామమును బట్టియే దేవుని మహిమపరచాలని పేతురు మనకు బుద్ధి చెప్పాడు (1 పేతురు 4:16). గనుక, దైవికమైన అధికారమువలన మనం ఈ నామాన్ని ధరించుకొంటున్నాం. ఇప్పుడు, నీవు ధరించే పేరును గూర్చి నేను ఆ ప్రశ్ననడుగవచ్చా? నీవు దానిని క్రీస్తు అధికారంవలననే ధరించావా? లేఖనాల్లో దానిని మనం ఎక్కడైనా కనుగొనగలమా?

## రక్షణ మార్గాన్ని బోధించే అధికారం

రక్షణను గూర్చి, మానవుడుగా ఒక వ్యక్తి తన వంతును నెరవేర్చవలసి యుంటుందని క్రీస్తు సంఘాలు బోధిస్తాయి. రక్షింపబడగోరినవాడు నమ్మాలి, తన పాపముల విషయమై మారుమనస్సు పొందాలి, క్రీస్తునందు తన విశ్వాసాన్ని ఒప్పుకోవాలి, పాపక్షమాపణ నిమిత్తము నీటిలో సమాధి చేయబడాలి. ఈ అత్యవసరమైన వాటిని గూర్చి అనేక లేఖన భాగాలు బోధిస్తున్నాయి (ఉదాహరణకు, అపొ. 2:38; రోమా 10:10లను చూడు; KJV.) అవన్నియూ "రక్షణకొరకే."

దేవుని పిల్లలగుటకు వీటన్నిటిని జనులకు బోధించడానికి మనకు క్రీస్తు అధికారముంది. రక్షణ "విశ్వాసంవలన మాత్రమే"నని బోధించే ఎవనికైనా అధికారం ఎక్కడనుండి వచ్చింది? నీతిమంతులుగా తీర్చబడడం విశ్వాసంవలన మాత్రమే కాదని యాకోబు బోధించాడు (యాకోబు 2:24). విశ్వాసం ఒక్కటివలన మాత్రమే రక్షణ అనే సిద్ధాంతం క్రీస్తు అధికారాన్ని నేరుగా దిక్కరిస్తుంది.

## ముంచడాన్ని అనుసరించడానికి అధికారం

ముంచడం అనే బాప్తిస్మాన్ని ఏ అధికారంవలన జరిగిస్తున్నాం? బాప్తిస్మమందు మనం పాతిపెట్టబడి తిరిగి లేపబడినట్టు పౌలు ద్వారా పరిశుద్ధాత్మ బోధిస్తున్నాడు (రోమా 6:3, 4; కొలస్సీ. 2:12). ఎఫెసీ. 4:5 బాప్తిస్మము ఒక్కటేనని అంటుంది. చిలకరించి, లేక కుమ్మరించి దానిని "బాప్తిస్మమని" జనులు ఏ అధికారంవలన అంటున్నారు? అలాటి ఆచరణలకు క్రీస్తు ప్రభువునుండి వారికి ఏ అధికారమూ లేదు. ఆయనకే "సర్వాధికారము" యివ్వబడిన సంగతి గుర్తుంచుకో. అది ఆయన బోధించక పోయినట్టయితే, దానికి దైవికమైన అధికారం ఉండదు.

## పశ్చాత్తాపమును కనుపరచిన విశ్వాసులకు మాత్రమే బాప్తిస్మం యివ్వ అధికారం కలిగియున్నాం

ఏ అధికారంవలన పశ్చాత్తాపమును కనుపరచిన విశ్వాసులకే బాప్తిస్మమిస్తున్నాం? బాప్తిస్మానికి ముందు విశ్వాసం ఉండాలని ప్రభువు బోధించాడు (మార్కు 16:16). నమ్మినవారు బాప్తిస్మం పొందినట్లు అపొస్తలుల కార్య గ్రంథంలో మనం చదువుతాం (అపొ. 8:12). బాప్తిస్మానికి ముందు మారుమనస్సు రావాలని పేతురు బోధించాడు (అపొ. 2:38ఎ). కొన్ని గుంపులవారు ఏ అధికారంవలన శిశువులకు చిలకరింపునిస్తారు? దానికి క్రొత్త నిబంధనలో ఏ ఆజ్ఞగాని, ఉదాహరణగాని ఉందా? అలాటిది ఉన్నట్టు నేనెరుగను. అలాగైతే, శిశువులకిచ్చే చిలకరింపు క్రీస్తు అధికారం లేనిదై ఉంది.

## ఆరాధనా కార్యములకు అధికారం

ప్రభువు దినమందు, మన ఆరాధనా కార్యక్రమంలో, క్రొత్త నిబంధన క్రైస్తవులు –

దేవుని వాక్యాన్ని ఉపదేశిస్తారు, ప్రార్థిస్తారు, కానుకలు సమర్పిస్తారు, ప్రభురాత్రి భోజనంలో పాలుపంచుకుంటారు, మరియు పాటలు పాడతారు. ఈ కార్యములను మనం ఎవని అధికారమువలన జరిగిస్తాం? పాటలు పాడడం (మినహాయించి) తప్ప తక్కినవన్నీ అపొ. 2:42-47లో ప్రస్తావించబడ్డాయి. పాడడం మాత్రం బైబిల్లోని యితర స్థలాల్లో చెప్పబడింది (ఎఫెసీ. 5:19; కొలస్సీ. 3:16). వారంలో మొదటి దినాన రొట్టెవిరుచుటను గూర్చి అపొ. 20:7లో ప్రస్తావించబడింది. వీటిలో కొన్ని ఏ అధికారాన్ని బట్టి విడిచిపెట్ట బడతాయి? ఏ అధికారంవలన వీటిలో సంగీత వాయిద్యాల వంటివి చేర్చబడతాయి? క్రీస్తు ప్రభువు వాటికి అధికారమిచ్చాడా? వాయిద్య సంగీతాన్ని ఆయన ఎక్కడా ప్రస్తావించ లేదు గనుక, దాని వెనుక ఆయన అధికారం లేదు.

## ముగింపు

ఏ పద్ధతికైనా పరలోకపు అధికారం లేకపోతే, అది మనుష్యులవలన కలిగినదై యుండాలి. మన ఆచరణలన్నిటికి ప్రభువైన యేసుక్రీస్తు యొక్క అధికారముందునట్లుగా నిశ్చయం చేసికొందాం.